# నింగికన్న నేల మిన్న

రాయప్రోలు హైమ

**దొరకు** గట్టిగ బుద్ధి జెప్పాలె.'' లంబాడి లోకియా గుడిసెలో నులక మంచం మీద వెల్లకిల పడుకుని అనుకున్నాడు.

'లాకపోతె... ఒక్క కోడిపెట్టకు గన్ని కొరడా దెబ్బ లేస్తాడు.' ఆక్రోశించింది వాడి మనసు. మనసు ఆక్రోశించగా కడుపులో పేగులు ''ఏం తక్కువ తిన్నావురా!'' అన్నట్లుగా అరచేయి.

'వావ్వో. గితాకల్లై తాంది! ఏమ్మినాలె బారేచను' అనుకున్నాడు నిస్సహాయంగా!

ఇంటి నిండా ఉడికినవీ, ఉడకనివీ పదార్థాలు బోలెడు పడి ఉంటే, అన్నీ తినలేక, తిన్నవన్నీ జీర్ణించుకోలేక, ఒకటో ఆరో సుతారంగా ముని వేళ్ళతో తాకీ తాకనట్లు తాకి, వడ్డించినవి వడ్డించి నట్లే ఉండగా కంచంలో చెయ్యి కడిగేసుకుని ఆహారం వెంట పాలు చేసే ''హైక్లాసు హిపోక్రైట్'' లాగా ''ఏం తినాలబ్బా'' అని తికమక పడటం లేదు లోకియా. అసలు తన నిత్య దరిద్రపు కొంపలో 'పన్ను కొరకడానికి పనికి వచ్చే వస్తువేదయినా ఉందా, అని ఆలోచించి, ఆలోచించి బుర్ర బ్బదలు కొట్టుకుంటూ అలా వెల్లకిలా పడుకున్నాడు.

ఆకాశం తెల్ల 'చుక్కల నల్లచీర' లాగా కనిపించింది లోకియా కంటికి. అది అమావాస్య నాటి అర్ధరాత్రి కాబట్టి అలా ఉంది. అదే పట్టపగలయితే సూర్యుడు వజ్రాల కుప్పలా కనిపిస్తాడు. మబ్బు కన్నెలు లాస్యంగా నాట్యం చేస్తూ దర్శనమిస్తాయి. ఆకాశ చిత్రకారుడు క్షణ క్షణానికీ రంగులు, మార్చి కొత్త చిత్రాలు గీస్తుంటే, లోకియా తన గుడిసె లోనే పడుకుని వాటిని తిలకించి పులకిస్తుంటాడు. కారణం—వాడి గుడిసె మీద పేడుకి పది గెడ లున్నాయి. వాసాని కొకటి చొప్పున అక్కడక్కడ తాటాకులున్నా, మిగతా మేరంతా కాళీయే. అష్టదిక్పాలురు అడ్డు లేకుండా విహరించ వచ్చు.

లోకియా గుడిసె కట్టించి సుమారు ఆరేళ్ళయింది. తల్లి 'హిరోలీ' బతికి ఉండగా ఆ దొరింటిలోనూ, ఈ దొరింటిలోనూ పాచి పనులు చేసి ''సందెడన్ని తాటాకు లియ్య దొరా'' అని బిచ్చమడిగి తెచ్చి సాలు కో తూరి గుడిసె కుట్టించేది.

'ఇప్పుడేమో అమ్మ బాయె. నా కయితె పెండ్లం బిడ్డల్లేరాయె. గుడిసె కుట్టిస్తుంది. కుట్టించుకుంటుంది, అనుకుంటాడు లోకియా. ఒంటరి బతుకే అయినా ''వం పెరుంగని'' నిస్సారపు బతుకు మాత్రం కా దతనిది. అసలు ఏ 'శరత్, లాంటి వాడో తల్చుకొని ఉంటే ''దేవదాసంతటి'' రొమాంటిక్ హీరో అయ్యేవాడేది అతని ప్రణయ గాథ. కాని కథ వేరే 'టర్న్' తీసుకుంది. మామూలు రచయిత పాలబడింది. తెలుగు శిల్పకారుడి చేతి 'జిగి బిగి' లేకపోయినా, స్త్రీల వ్రత కథల పాటి చెయ్యక పోదని హామీ.

కులాచారం అనుసరించి లోకియా సొంత కుల పింటి కన్నె 'బిబిలీ' మీద కన్నేసి తీరికగా ఆర్నెల్ల పాటు ''కోర్టింగ్'' నడిపించాడు. బిబిలీ నడియేటి వీధి పడవ లాగా కడవ చంకన పెట్టుకుని మంచినీళ్ళ బావికి వెడుతుంటే లోకియా పడవ వెంట ఉండే తెరచాపలా ఆమె వెనకే వెళ్ళేవాడు. బిబిలీ నీళ్ళతోనూ బరువుగా ఇంటి ముఖం పడితే లోకియా బరువయిన ప్రణయ గీతాలు లంబాడీ భాషలో పాడుతూ ఆమె అడుగులో అడుగు వేసుకుంటూ వాళ్ళ గుడిసె ముందు దిగ విడిచేవాడు.

బిబిలీ లోకియా ప్రేమని ముసి ముసి నవ్వులతో ''రెసిప్రొకేట్'' చేసేది. ప్రేమ పరీక్షా కాలం ఆర్నెల్లు ఇట్టే గడిచి పోయింది. వూళ్ళో ఎవరూ ఈ గువ్వల జంటని విడ విప్పడానికి ప్రయత్నించ లేదు. ఇక లోకియా బిబిలీని పెళ్ళాడి తను పెట్టబోయే సంసారానికి అవసరం అనుకున్న కుండ, ముంత, మంచం, కంచం కొనేసేడు. లగ్గం నాడు పెండ్లి పిల్ల కివ్వవలసిన అద్దాల లంగా, దంతపు గాజులు అన్నీ అమర్చేసుకున్నాడు. ఇక మంచి రోజు చూసుకుని 'బిబిలీని' ''లాగుడు పెళ్ళి'' ఆడేయడమే తరవాయి.

కామునిపున్నమి రానే వచ్చింది. కుల పెద్ద లందరికీ ముందుగానే చెప్పి మంచినీటి కడవతో బరువుగా ఇంటి కొస్తున్న బిబిలీని సంప్రదాయం ప్రకారం అమాంతం రెండు చేతులతోనూ ఎత్తి చంక నేసుకున్నాడు లోకియా. బిబిలీకి లోకియా మీద విపరీతమయిన మోజు, పూరికే ఫార్మాల్టీకి కాళ్ళు—చేతులు గింజుకున్నట్లు నటించింది. కాని వూపిరి బిగబట్టి ప్రియుడి చంకలో తేలిక గా కూచుంది. బిబిలీ తల్లి తండ్రులకీ కూడా పెళ్ళి ఇష్టమే. రివాజు కోసం నామమాత్రంగా ''పెండ్లి పిల్ల దొంగ'' ను చింత పిక్కలతోనూ గులక రాళ్ళ తోనూ కొట్టి 'బాధిర చేరే కాని లోలోపల ''లోకియా గాడు వాని గుడిసె దక్క బిబిలీని మోస్కానెళ్తె మంచిగుంటది'' అనుకున్నారు.

కాని విధి వక్రించింది. పెండ్లి పిల్ల గాని గుడిసె పది బారల దూరంలో ఉండగా ''ఇగ మమ్మల్నెవ లిప్పలేరు''అని ప్రేమికులిద్దరూ ఉబలాటపడుతుండగా గుంపులో కేకలు. ఈలలు మిన్ను ముట్టగా లోకియా ప్రేమావేశం పరాకాష్ఠ నందుకుంది.

''తద్ధింత ధీం ధీం'' అంటూ గంతులు వేశాడు. కాలికి మైలురాయి తట్టుకుంది. బోర్ల బొక్కల పడ్డాడు. బిబిలీ పడింది. ఆమె చంకలో కడవ పడింది. పగిలింది. లోకియా ప్రేమదీపం మలిగింది. లగ్గం ఆగిపోయింది. ప్రేమ తాండవం చివరి కంటా నలుపలేని జంటకి పెళ్ళి యోగం లేదని కులపెద్దలు నిర్ణయించారు. కొంత కాలానికి బిబిలీ పేరిగానితో పారిపోయింది.

అంతే! లోకియాది ఒంటరి బతు కయిపోయింది. ప్రేమ ఫలించని పిచ్చి బతుకు. ఎటు గాలి వీచితే అటు వూగిపోయే గాలి బతుకు. అందుకే గాలి వానల్ని సైతం లెక్కచెయ్యని మొండితనంతో ఆ నాటి నుంచి ఈ నాటి దాకా గుడిసె కుట్టించనే లేదు వాడు.

''గిప్పుడా ముచ్చట్లన్నెందుకూ! దొరని—దొరని దెబ్బ దీసే దాలోచించాలె గానీ...''

గత స్మృతుల నుంచి బయట పడి ఒళ్ళు విరుచుకుంటూ లేచి మంచం మీద నిటారుగా కూర్చున్నాడు లోకియా. గుడిసె నాలుగు మూలలా కలియ జూశాడు. చిమ్మ చీకటి. చిన్న బుడ్డి దీపం కూడా లేదు. కాని అతని ఎక్స్—రే కళ్ళకి గుడిసెలో ఎక్కడెక్కడ ఏమేం ఉన్నదీ చక్కగా కనిపించేసింది.

ఉట్టి మీదున్న మూడు కుండ పిడతలు. ''అట్టియ్యే...'' సరిగ్గా ఉట్టి కింద నేలమీదున్న ట్రంకు పెట్టెలో పాత కంబళీ గుడ్డ. ''గానాడు బిబిలీ కోసం కొన్న పెండ్లి బట్టలు. కొంచెం అస్కుంట— అరె— బుట్టలో జొన్నకంకులుంటే వాని మాటే యాదికి లేదె.''

చివాల్న లేచాడు లోకియా! ఎండు చిదుకులు రగిలించాడు. మంట వెలుగులో బాగా కాలిన జొన్న గింజలు వెదికి వెదికి మరీ తిన్నాడు. ఆకలి తీరింది. ''ఇగ దూడ సంగతి జూడాలె.''

కల్లు ముంత ఖాళీ—కడవలో మంచినీళ్ళయితే ఉన్నాయి నాలుగు రోజుల నాటివి. ముంతెడు మంచి

గడగడ తాగేశాడు. పై మీది గుడ్డతో మూతి తుడుచుకున్నాడు. 'బ్రేవ్' మని త్రేన్చాడు.

"గిప్పుడు దొర పని బట్టాలె" అనుకున్నాడు. ట్రంకు పెట్టె తెరిచి కంబళీ తీసి కప్పుకున్నాడు. మూలనున్న చేతికర్ర అందుకున్నాడు. "డాన్ క్విక్సోట్" యోధుడి లాగా బయట పడ్డాడు.

ధర్మారెడ్డి గడీ కెళ్లి నడిచాడు.

నిశి రాత్రి గంటెంతయుందో మరి. "పిట్ట పిర్ర మంట లేదు." లోకియా అడుగుల చప్పుడు విని ఒకటి రెండు వూర కుక్కలు 'భౌంయ్' మన్నాయి.

"వూట్! లండి లోకియా గా స్నెరగనట్లు మొరుగుతారు! మీ గొంతుబడ." చేతికర్రతో కుక్కల్ని అదలించాడు. పరిచయమున్న గొంతు విని కుక్కలు గారాలు పోతూ సద్దు మణిగాయి.

శివాలయం మలుపు తిరిగాడు. దూరాన్నుంచి నక్కల వూళ వినిపించింది. "నీ పాడు బడ—గీలొల్లని జనం లేస్తారో యేం కతనో!" విసుక్కుంటూ ముందుకి సాగాడు. ఏదో కీచు కీచు వినిపించింది. పరకాయించి చూశాడు—పెద్ద బావురు పిల్లి పెద్ద కోడిపుంజుని నోట కరచుకుని పారిపోతూంది.

"ఉస్స్యాన్!" పిల్లిని చేతి కర్రతో అదలించాడు. కాని అది బావురుపిల్లి. మామూలు పిల్లి లాగా పారిపోదు. ఎదురు తిరిగి అరుస్తుంది. అలా జరిగితే దాని నోట్లో ఉన్న పుంజు కింద పడిపోతుందనీ, తను దాన్ని చేజిక్కించుకుని పరుగు పెట్టచ్చనీ లోకియా ఆశ. బావురుపిల్లి ఎదురు తిరగనూ లేదు, పుంజు కింద పడనూ లేదు. దీపపు స్తంభం వెనక నుంచి గుడి గోడ మీదికి ఒక్క దూకు దూకి పుంజుని గుడి వెనక్కి ఈడ్చుకు పోయింది పిల్లి.

"అవ్వో! గంత పెద్ద పుంజును ఒక్కదానివే మింగుతవా... నే." తిట్టుకున్నాడు పిల్లిని. "ఎవ్వల పుంజది?" లోకియా ఆలోచిస్తూ అడుగులు వేశాడు.

"పటేల్ దొర్దే గావచ్చు. గాయనకే పందెం పుంజుల పసందు మస్తు వుంది గ. పనోల్లు పుంజుని చక్కంగ దాయలేదేమొ— పాపం! తెల్లారి పంక దొర లబో దిబో మంటడు." జాలి పడ్డాడు. అంతలోనే మళ్ళీ కోపం.

"గిట్టనే జరగాలె ఈ దొర నా కొడుక్కుకి..." వెటకటి గాడవేదో గుర్తొచ్చి గాల పెట్టింది వాడి గుండె!

"లాకపోతే... గప్పుడు బస్తీ దొరొచ్చి ఎలచ్చన్ల టీదోల్లకి తలకి "దస్ రుప్యా" ఇమ్మ నీయన కిస్తే, గీయనేం జేసిండు! తలకి 'దో రుప్య' ఇచ్చిండు. బాకీ మొత్తం మింగిండు! ఈయన పందెం పుంజుల కోసం నే నెందుకు సోచాయించాలిగ! మొత్తం పుంజుల్ని తెల్లందనక నక్కలు పిల్లు లిద్దెయ్యాలె. నా కల్లు సల్లబడాలె. హి హి హి."

వెర్రిగా ఆలోచిస్తూ—వెకిలిగా నవ్వుతూ గ్రామ కచేరీ మలుపు తిరిగాడు లోకియా. చౌకీదారు నిద్ర పోతున్నాడు. తెల్లవార్లు కచేరీ సావడి చుట్టూ గస్తీ తిరగాల్సిన "చౌకీదారు" లోకియాకి తెలిసిన మేరకు పొద్దు వాలీ వాలగానే సావడి అరుగు మీదున్న బల్ల కడ్డం బడి గురక పెట్టి నిద్ర పోవడమే కాని గస్తీ తిరిగి ఎరుగడు.

"సరకారోడి సొమ్ము పున్నేనికి మింగుతున్నడు. ముండకొడుకు. ఒక్క రోజన్నా కొలువు సక్కంగ జేసిండా!" సణుక్కున్నాడు. "వీని తాత ఈనా



మున్నదనా పన్జెయ్యకుండా 'తనఖా' దీసుకుంటున్నరు. నా తాత దంగతే లేదనేనా—ఆ నాడు కచేరి ముంగలున్న ఎండు నేరేడు చెట్టు కొట్టి పుల్లలమ్మబోతె—పుల్లల్దొంగతనం జేసిన్నని పటేల్ పట్వారీలకు పట్టిచ్చిన్రు—కొట్టిచ్చిన్రు. గందుకే పెండ్లాం జచ్చిపోయె. కోడల్లేచిపోయె.

"నీ యవ్వ సిగ దరగ. గామునృట్ల న్నెందుకురా, లోకియాగా ... మొట్టమొద ల్దొర పని పట్టె దెలాగో గది సోచాయించరా బద్మాష్..."

తనని తనే మందలించుకుని గబగబ నడిచి కచేరీ సావిడి దాటిపోయేడు. ఈరారెడ్డి దర్వాజా తెరిచి ఉంది. లోపల లైట్లు వెలుగుతున్నాయి. రోజా చీకటి పడకుండానే "గువ్వా గూడెక్కె రాజా మేడెక్కె" అన్నట్లు లైట్లార్పి దర్వాజా బందుచేసే ఈరారెడ్డి ఈ రో జెందుకు మేలుకొని ఉన్నాడో అర్థం కాలేదు లోకియాకి.

"ఏమాయె! దరవారెడ్డి దొర గీడున్నలా ఏందీ?" నిరాశగా అడుగు ముందుకువెయ్యబోయేడు లోకియా. ఫాటక్ తెరచిన చప్పుడయింది. గోడవార నక్కి నిలబడ్డాడు.

ఈరారెడ్డి గేటు తెరచి బయటకొచ్చేడు. అటూ ఇటూ చూసి ప్రహరీ గోడకేసి తిరిగి కూర్చుని కాలకృత్యం కానిచ్చేడు. తను మేలుకొనే ఉన్నట్లు స్థిరపరుస్తూ "ఖంగు ఖంగు"మని దగ్గేడు. గేటు దగ్గరే నిలబడి నాలుగు వైపులా కలియజూసేడు. ఈరారెడ్డికి ముసలితనం వల్ల చూపు తగ్గిపోయింది. చెవులుమాత్రం పాముచెవులు. చిన్న అలికిడి అయితే చాలు "ఎవ్వడ్రాడు" అని అరుస్తూంటాడు. ఒక్కొక్క సారి అస లే చప్పుడూ కాకుండానే ... ముందు జాగ్రత్త చర్యగా అరుస్తుంటాడు.

పరధ్యానంగా నిలబడిన లోకియా చేతిలో కఱ్ఱ పట్టు తప్పి జారి నేలమీద పడి చప్పుడయింది.

"ఏయ్! ఎవ్వడ్రాడు!" ఈరారెడ్డి క్షణం తడవు చెయ్యకుండా అరిచేడు.

"నేన్దొరా! లంబాడి లోకియాగాణ్ణి ..." చలితో దవడలు కరుచుకుని పోతున్నాయి. గొంతు పెగిలి మాట రాలేదు లోకియాకి—అతి కష్టం మీద అన్నా డా మాటలు.

"ఇంత రాత్రి రీదేం జేస్తున్నావురా! ఏందీ... బస్తీ జైల్‌కి పోతవా యేంకత?"


ఈరారెడ్డి మా అనుమానం మనిషి.

"వరంగ ల్దొరిండ్ల కెల్లి గిన్ని ఎండు సిదుగులు తెచ్చుకోను బోతున్న, దొరా. సలికి సస్తాన్న..." లోకియాకి సమయస్ఫూర్తి ఉంది.

"తెచ్చుకుంటె తెచ్చుకోగానీ ... మల్ల ... గోడ దూకిన వంటె వోరంగల్లు జైలుకి దోయిస్త, కొడకా ... మాడ్సి సంపుతా ... తెల్సా ..."

ఈరారెడ్డి ఫాటకు మూసి లోపలి కెళ్ళిపోయేడు. ప్రహరీ లోపల మాను కట్టి రోడ్డుమీదకంటా కొమ్మలు విస్తరించిన వేపచెట్టు కింద నక్కి నిలబడి ఉన్న లోకియా మళ్ళీ రోడ్డెక్కేడు.

"నన్ను బస్తీ జైలుకి బంపుతవా! నేన్నీకు దొర్కుతేనా! పొద్దుపొడిచేవరకల్లా నేనే బస్తీల్నుంటా! జరంత సేపట్ల దరవారెడ్డి దొర ఫాటకుదూకుతా.




ఇంటెనక్క గొడ్ల పాకల కెల్లి పోట్టేల్నిప్పుతా. దొడ్డి గుమ్మమ్గ కెల్లి దాన్ని దోల్కపోయి బస్తీ కెల్లి పోతా. ఇగ ఈ లోకియాగాడు యెనక్కి రానేరాడు. హి హి హి."

కులికేడు లోకియా. సంక్రాంతికి వరంగల్లు సివార్లలో జరిగే పోచమ్మ జాతరలో పొట్టేలుని బలిచ్చి ఖుషి చేసి మరింక వెనక్కు రాకుండా అక్కడే ఉండిపోదామని తలంపు వచ్చి నాల్గు రోజులయింది. సమయంకోసం ఎదురు చూస్తున్నాడు! అంతే!

పుట్టి పెరిగిన వూరు వదలి వెళ్ళిపోవాలంటే మనసు రావటం లేదు లోకియాకి. అయినా "బస్తీ మంచిగుంటది" అని పదే పదే అనుకుంటున్నాడు. "ఈ వూర్ల నుంటే ఒక్క మంచి మడిసికూడా లేక పాయె" అని కూడా చాలాసార్లనుకున్నాడు.

"గిన్ని సింత కాయులుండి యెండిపోయి సెట్ల కింద రాలిపోతాన్నె ... ఒక్కటంటె ఒక్క బుట్టెడు నిస్కాని సార దుకాణ సాయబుకు అమ్మిన్నని ... సితక బాదిస్తు ... ఈరారెడ్డి దొర! ఏం జేసుకుంట దంత సెస్తెండు!... బిడ్డల్లేని గొడ్డుమొండకొడుకు. రోజుకో అరద మునుగు సిన సందుతో చారు కాపించుకొని తాగుతడా ... చార్ల తానమాడతాడా."

ఉన్న సంపద నంతటినీ ఒక్కడే అనుభవించేద్దామనుకొనే ఈరారెడ్డి స్వార్థ బుద్ధి తలుచుకొని "ఛీ" అనుకున్నాడు లోకియా.

"పల్లెటూళ్ల కంటె బస్తీలే మేలు—ఈ బజార్ల కోడిపెట్ట కాజేసి ఆ బజార్ల అమ్మేసినా ఎవ్వ రన్మానించరు.

"కోళ్లు కుక్కల్దొరక్కుంటె ఊడ్సుయితె పస్తులు బడాలె ... పట్నం పట్న గాదు. మంచిగ లైలు బొగ్గు దొరుకుతది... కొనేటోల్లుంటరు. 'షాన్ గ బత్కచ్చు!"

చీకట్లో ముందుకి సాగిపోయేడు లోకియా. ధర్మారెడ్డి 'గడీ' అంటే మూడంతస్తుల మేడ, చుట్టూతా ఎత్తైన గోడలు. బల్లెల్లాంటి వూచలున్న గేటు. లోపల పెద్ద తాళం కప్ప వేలాడుతోంది. చలికాలం ... మేడ మీద గదులన్నీ బంద్‌చేసి ఉన్నాయి. ఎక్కడా

దీపవు కొన కూడా కన్పించడం లేదు. సింహద్వారం ముందు అద్దాల గూటిలో 'ప్రమిద దీపం' ఎప్పుడూ వెలుగుతూ ఉంటుంది. ఈ రో జదికూడా కొడిగట్టి మలిగింది.

లోకియా ఫాటక్ పక్కనే తటపటాయిస్తూ పది నిముషాలు ఆగిపోయేడు. దొరని దెబ్బతియ్యాలంటే ఇదే మంచి సమయం అని వాడి బుద్ధి తొందర పెడుతుంటే "సిన్నప్పుడు నీతో గోలీలాడిన దోస్తు—నిద్దట్లుండగ... పొట్టేల్నెత్తకపోయి ఎట్ల దెబ్బ తీస్తావు" అని మనసు వెనక్కి లాగుతోంది. చివరికి బుద్ధే గెలిచింది. లోకియా గేటు అడ్డ వూచల మీద కాళ్ళేసి నిచ్చెన మెట్లెక్కినట్లు చివరికంటా పాకేడు. కుడివేపు గోడ మీదికి నెమ్మదిగా జరిగేడు. అర్రమీద దట్టంగా అల్లుకున్న 'బోగన్ విల్లా' కొమ్మల చాటున నక్కి ఎవరయినా మేలుకొని ఉన్నారేమో చెవులు రిక్కించి విన్నాడు. ఎడం వైపు కక్కసు దొడ్ల దిక్కునుంచి ఏదో శబ్దం.


గడియ తీసిన చప్పుడు... మూసిన చప్పుడు. "వాయెవ్వా... ఎవలో లేచిన్రు." కంగారు పడుతూ పాటలోకంటా నక్కిపోయేడు.

"నీ ముండ్లు పాడుబడ... కంబళీల కెల్లి గుచ్చుతాన్ను ..."

ఆచ్ఛాదన లేని పిక్కల మీద చురుకు చురుకున గుచ్చుకుంటున్న బోగన్‌విల్లా ముళ్ళని తిట్టి పక్కకి నెట్టేడు. కాంపౌండు లోకంటా ఒంగి తొంగి తొంగి చూసేడు. మళ్ళీ కక్కసు దొడ్ల దిక్కున చప్పుడు—"పేదోళ్ల పొట్టలు కొట్టి ఖజాన్లు నింపుతాన్ను. మస్తుగా తింటాన్ను! తిన్నది అర్గక ఏడుస్తాన్ను—సీ..."

ధర్మారెడ్డిమీద కోపం క్షణక్షణానికీ పెచ్చు పెరిగి పోతోంది. "తిండికి లేక మాడిపోత ... ఒక్కటంటే ఒక్క కోడి పెట్టను దీసుకున్నందుకు గిన్ని కొరడ దెబ్బలు కొడతడా—" ఆలోచించిన కొద్దీ కడుపు కుతకుత ఉడికిపోతోంది.

ధర్మారెడ్డికి వందల కొద్దీ ఎకరాల పొలాలున్నాయి. మందల మందల గొడ్లున్నాయి. గొర్రెల




నిండా వడ్లున్నాయి. ఇనప్పెట్టె నిండా వీసెల వీసెల వెండి బంగారం మూలుగుతున్నాయి. ఇద్దరే పిల్లలు. ఒక్క పోరి, ఒక్క పోరడు. "ఏం జేసుకుంట డవన్నీ?"

"బత్కడానికి దొవ్వలేక, పన్జెయ్య చాతకాక ఒక్క కోడిపెట్ట నమ్ముకొని సారా తాగిన్నని కొడతడా. దొంగ ముండకొడ్కని తిడతడా ... దొంగతనాల్జేసి వేను కోటలు బనాయిస్తన్ననా ... నా పొట్ట మందం దొర్క బుడ్చుకుంటాన్న! గంతేనా! ...

కుప్పలుగా ఐశ్వర్యం పేరబెడుతున్న ధర్మారెడ్డి దొర ఫారంలోనించి ఆకలి చావునించి తనని తాను రక్షించుకోడానికి ఒక్క కోడి పెట్టను తీసుకోవడం దొంగతనం ఎలా అవుతుందో లోకియాకి అర్థం కాలేదు—దొంగతనం అనుకుంటే చేసేవాడే కాదు.

"నా పొట్ట మందం ఎంత గావాలె! ఆ మాత్రంలో దొరకేమి లోటుంటదా" అనుకుని లోగడ చాలా సార్లు కోతకు సిద్ధంగా ఉన్న జొన్నచేలోనించి కంకులు కోసుకుని అమ్మేసుకున్నాడు. కుంకుడు చెట్లు దులిపి కాయలు అమ్మేడు. గొర్రెలనీ, మేకలనీ చాటుగా తోలుకెళ్ళి కబేళా సాయేబుకి అప్పగించేడు. ప్రతి సారీ పట్టుబడ్డాడు—దొరచేత తన్నులు తిన్నాడు. దానికి లోకియా ఎన్నడూ బాధపడలేదు.

పెట్టిన చెయ్యి కొట్టదా మల్ల ... అనుకున్నాడు.

"దొరతనమంటె గంతె. కిందోల్లని కొట్టడమే ... అని సరిపెట్టుకున్నాడు.

కాని ఈ సారలా కాదు—"కాలు మొక్కుత—కడుపాకలి కిర్దిసుకున్న...బాంచను—కొట్టద్దు, దొరా జెరంగున్నది. జెరం తగ్గినాక కొడుదువులే, దొరా... దొరా." గింజుకున్నాడు లోకియా. లక్ష్యపెట్టలేదు దొర. హంటరుతో బాదేడు—నేలమీద దొర్లించి బూటు కాలితో తన్నేడు. వుండ్లుపడిన మొహం మీద కాండ్రగించి వూసేడు.

"గాడ్ద కొడకా! మాగ కండ్ల బడతవా! నా ఫాగమ్ల కాలు బెడతవా! మల్ల ... వక్కలు వక్కలు గోస్త—హొషియారుండు బద్మాష్ ... ధర్మారెడ్డి కోపంతో వూగిపోయేడు.

"వూగుతడు, వూగుతడు!" లోకియా కోపం తార స్థాయి నందుకుంటోంది. పట్టుదల పర్వతంలా పెరిగిపోతోంది.

ఇగో! ఇయ్యాలి లంబాడి లోకియాగాడు ధర్మారెడ్డి దొర మోజు పడి పెంచుతాన్నా ... పొట్టేల్నెత్తుకెల్లి ... పోచవ్వకి బలిచ్చినాక ... గప్పుడు... కుల్లి కుల్లి ... పరేషానయి ఏడ్చి గప్పుడు వూగుతడు.

ఇక రంగంలోకి దిగుదామని పరధ్యానానికి స్వస్తి చెప్పి కాంపౌండు లోపల కలియజూసేడు లోకియా. మనిషి పత్తా లేడు. చిమ్మ చీకటి. "గిదె మంచి సమయం—గోడ దూకి గొడ్ల పాకల కెల్లి ఉడాయించాలె..." అమావాస్య చీకటిలో నల్లగా కన్పిస్తున్న ఎర్ర బోగన్‌విల్లా పూల గుత్తి ఒకటి గాలికి అట్నించిటు ఒరిగింది.

"వోస్! పూలగుత్తేనా! పామన్కొని జెదిర్నా." తేలికగా వూపిరి తీసుకుని బహు తేలికగా గోడ దూకాడు. పిల్లి లాగ మెత్తటి అడుగులు వేసుకుంటూ మేడ వెనక గొడ్ల సావిడిలోకి మారాడు. పశువులన్నీ అస్తవ్యస్తంగా గుంజలకి కట్టబడి ఉన్నాయి. కొన్ని పడుకున్నాయి. కొన్ని నిలబడే నిద్ర కుపక్రమించాయి. మరికొన్ని నిద్రలోనే తోకలు జాడిస్తూ దోమలు తోలుకుంటున్నాయి.

దొర మోజు పడి పెంచుకుంటున్న మెలిక కొమ్ముల పొట్టేలు కోసం లోకియా మెరుపు కళ్ళు త్వర త్వరగా వెదికాయి. దక్షిణం వేపు చిట్టచివరి స్తంభం దగ్గరుంది పొట్టేలు. కటిక చీకటిలో కూడా దాని పోత్రించిన శరీరం ప్రస్ఫుటంగా కనిపించింది. లోకియా గుటకలు మింగాడు.

"జల్ది పని కానియ్యాలె." బల్లి లాగ నేల కరిచి పెట్టుకుని పాక్కుంటూ పొట్టేలుని సమీపించాడు. సగం నిద్ర, సగం మెలకువ లాంటి స్థితిలో ఉన్నారు పొట్టేలు స్వామివారు. మనిషి అలికిడి విని కొమ్ము విసిరి ఒక్క అరుపు అరిచింది. లోకియా బహు లాఘవంగా దాని కొమ్ముల వాత పడకుండా తప్పించుకున్నాడు. పొట్టేలు అరుపుకి గొడ్లన్నీ ఒక్కసారిగా లేచాయి. అరుపులు మొదలు పెట్టి అయిదు నిమిషాల పాటు లొల్లి చేశాయి. మళ్ళీ వాటంతట అవే సద్దుమణిగాయి. స్తబ్ధం వార నక్కిన లోకియా నెమ్మదిగా కంబళి లోపలున్న గోగునార తాడు తీశాడు. నిలబడి అందుబాటులో ఉన్న గడ్డి పరకలు అల్పాహారం సేవిస్తున్న పొట్టేలుస్వామి వెనక చేరి ఒడుపుగా తాడు విసిరి వెనక కాళ్ళు రెండూ దగ్గరగా బిగించి ముడేశాడు. తనకేం జరుగుతూందో పొట్టేలు గ్రహించే లోపునే ముందర కాళ్ళకికూడా ముడి బిగుసుకు పోయింది. నిస్సహాయంగా మూలగడం తప్ప మరేమీ చెయ్యలేక పోతున్న పొట్టేలుని అడ్డంగా నేలమీద పడగొట్టేడు లోకియా! దాన్నలాగే ఎత్తి మెడమీద కూలేసుకుని 'వజను' అందాజ కట్టాడు.

"నీ యవ్వ! బస్త దాన్యమంత వజనున్నవే!" దింపి మళ్ళీ నేలమీద కూలేశాడు. "గింత వజను బుజాల మీద పెట్టుకొని ఫాటకు ఎక్కేదెలా, దిగేదెలా?" పలాయనం చిత్తగించడానికి అనువైనుకుందామని దొడ్డి గుమ్మం వేపు నడిచాడు. దొడ్డి వేపుకూడా తాళం వేలాడుతూంది. కాని గోడ ఎత్తు తక్కువ. కాస్త కష్టపడితే పొట్టేల్ని మెడమీద వేసుకుని వెనక వైపుకి దూకచ్చు.

"జల్ది గోడ దూకాలె! పొట్టేలు లొల్లి జేస్తంది. దొర లేస్తడో యేహా..." కంగారుగా పాక వైపుకి నడుస్తున్న లోకియా కాళ్ళు టక్కున ఆగిపోయాయి.

ఏదో శబ్దం—కక్కుసుదొడ్డి చప్పుడు మాత్రం కాదు. ఇనప పని ముళ్ళేవో ఒక దానితో ఒకటి రాపాడిస్తున్న చప్పుడు— చెవులు రిక్కించి మేడ కేసి చూశాడు లోకియా. ఏ గదిలోనూ దీపం ఉన్నట్లు లేదు. ఎవరూ మెలకువగానూ లేరు. నీరవ నిశ్శబ్దాన్ని చీలుస్తూ ఇనప బీరువా తెరుస్తున్న చప్పుడు— మూస్తున్న చప్పుడు!

ఉండబట్టలేక లోకియా ధ్వని వస్తున్న దిక్కుగా నడిచాడు. దొర పడుకునేది దక్షిణం వేపు గది. దాని పక్కనే ఇనప్పెట్టె కదా! "అరె! ఎవలు కిటికీల కెల్లి దూకుతాన్లు?" చప్పుడు చెయ్యకుండా అక్కడే నిలబడి పోయాడు లోకియా! లోకానికి మసి పూసినట్లున్న చీకటిలో నల్ల కంబళీ కప్పుకున్న లోకియా ఎవరికీ కనపడడు. కాని కాంతు లీనే వాడి కళ్ళకి మాత్రం 'ఆజానుబాహు'లైన నలుగురు నల్ల చెడ్డీల వాళ్ళు ధర్మారెడ్డి దొర ఇనప్పెట్టె గది కిటికీ వూచలు వంచి ఒక్కొక్కరే లోపలకి దూకుతూ కనిపించారు. క్షణం సేపు చేష్టలుడిగి నిలబడి ఆలోచించేడు లోకియా. పరిస్థితి అవగాహన అయింది. కాగల కార్యం గంధర్వులే తీరుస్తున్నారు.

"మంచిగయింతాన్ది, దొరకు! గట్టనే కావాలె. నన్ను కొడితే నిన్ను దేవుడు కొట్టడా మల్ల." విచిత్రమయిన చిరునవ్వు మెరిసింది వాని పెదాల మీద.

ధర్మారెడ్డి ఇనప్పెట్టె కొల్లగొట్టబోతున్న నలుగురు నల్ల చెడ్డీల వాళ్ళు లోకియా కళ్ళకి గొప్ప ధర్మసంస్థాపనాధురీణుల్లా కనిపించారు క్షణం పాటు. అంతే మరి! చిన్న చేపను పెద్ద చేప మింగితే, పెద్ద చేపను ఇంకా పెద్ద తిమింగిలం స్వాహా చేస్తుంది!

''మొత్తం వూడ్చుకపోతరు, దొర సొమ్మంతా! గంటలో కాళీ! ముత్తవ్వ సొమ్ములు, నాన్నమ్మ సొమ్ములు ...అవ్వ నగలు ... లచ్చిం దొరసాని జవాహరీ మొత్తం అరె ...'' లోకియా ఆలోచనల్లో ఏదో అనుకోరాని సంగతి స్ఫురించింది.

''వాయ్యో! లచ్చిందొరసాని నగలు కూడ దోస్కుం టరాబద్మాష్ ముండకొడ్కులు...గామేం జేసిన్ది పాపం పండగస్తె పబ్బమస్తె బీదోల్లకి బిక్కోల్లకి కింత అన్నం బెడ్తది! పప్పు బెడ్తది. దొర తన్నినప్పుడంతా మేడెన్కకి గొంచకపోయి ''ఎందుకు దొంగతనం జేస్తవురా! ఎందుకు తన్నులు దింటవురా! ఆకలయితే నన్నడ్గ రాదుర...నీకింత బువ్వ పెట్టలేనుర...'' అని సల్లంగ ముచ్చట జెప్పి కడుపు నింపేటిదే ... లచ్చిం దొరసానీ ... తల్లీ ... ఎంత మంచిదానవమ్మా తల్లీ'' లోకియా దృష్టిలో లచ్చిందొరసాని మడిసి కాదు! మడుసుల్ని, మానుల్ని సక్కంగ సూసే దేవత.

''నా పానం బోయినా తల్లీ ... నీ నగలుమాత్రం బోనియ్య'' లోకియా బుర్రలో తళుక్కున ఏదో ఆలోచన మెరిసింది. పెద్ద పెద్ద అంగలేసుకుంటూ ముందుకి నడిచేడు.

''మాతల్లి! మా అవ్వ! లచ్చిందొరసానీ! పస్తున్న మంటె పప్పన్నం పెడతవు! జొరమచ్చిందంటే జావ కాచ్చి పోస్తవు. ముత్రాసోల్ల గూడెం కాలిపోంగా పద్నాలపా టందర్కి తిండి నడిపించినవు! చిన్నప్ప బిడ్డకి పాదులయితాన్టె పురుడు పోయించినవు! దొరసొమ్ము దోస్కుంటె దోస్కనీ ... నీ నగలు మాత్రం ముట్టనియ్య...''

ధర్మారెడ్డి దొర దక్షిణపు గదిలో కిటికీ పక్కనే ఎత్తు మంచం మీద పడుకుంటాడు. చలి విపరీతంగా ఉందేమో కిటికీ మూసేసి ఉంది. లోకియా కిటికీ దగ్గర నిలబడి ''దొరా! దొరా'' అని మెల్లగా పిలిచేడు. దొర లేవలేదు. కిటికీ తలుపులు చిన్నగా తట్టేడు లోకియా! ధర్మారెడ్డి లేచేడు!

''ఎవ్వడ్రా! కిటికీ కొడతాన్నది'' గర్జించేడు దొర!

''నేన్దొరా! లంబాడి లోకియాగాన్ని! జల్దీ లెగు దొరా!'' దొర లేవకుండానే దొంగలు పారిపోతారేమో నని కంగారు పడ్డాడు లోకియా! అసలు తనే వాళ్ళని ఎదిరించే వాడు. కాని వంటరిగా చీకట్లో నలుగుర్ని పట్టే కంటె దొరని లేపడమే మంచి దనుకున్నాడు.

''అర్ధరాత్రి నీకు గడీల్నేమి పనిరా!'' దొర కళ్ళు నులుముకుంటూ లేచి మంచం మీద కూర్చుని కిటికీ తెరిచేడు.

''నీ పొట్టేలుని తోల్కపోను అచ్చినా, దొరా! నీ కపకారం చెయ్యాలనేదే నా ఆశయం అయినా ... లచ్చిందొరసానికి అపకారం జరుగుతుంటే చూడలేక నిన్ను లేపుతున్నా'' అన్నది లోకియా భావం.

దొర కళ్ళు మరింత గట్టిగా నులుముకున్నాడు. ''ఏందీ! నా పందెం పొట్టేల్ని తోలకపోను వచ్చినవా'' అని గర్జిస్తూ కిటికీ తెరిచాడు.

''నాగడీల కెల్లి నాపొట్టేల్ని తోల్కపోత పైగా కతల్లో దొంగ లొచ్చిగ నన్నే నిద్రలేపి చెప్తవురా! గాండూ!...'' దొర మంచం మీద నుంచి ఉరికి గోడని వేలాడుతున్న హంట రందుకున్నాడు. వూడి పోతున్న లుంగీ బిగించి తలుపు దబేల్న తెరిచేడు.

''సాలే! లఫంగీ! లంబాడి లోక్యాకా బచ్చా! ఇయ్యాల నీ యంతు జూస్తన్రా! రేయ్! కొండా! కొమిరిగా! లెగండ్రా!''

లోకియా విషయం వివరంగా చెప్పాలనుకుం టుండగానే దొర చేతి హంటరు ఝళ్ళుమంది.

''గాడిద కొడకా. దగాకోర్! దోకేబాజ్!

దొరనోటి వెంట బూతులు ధారావాహికంగా వెలువడుతున్నాయి. చిన్న పామునైనా పెద్దకర్రతో కొట్టే అలవాటున్న ధర్మారెడ్డి దొర లోకియాని చితక బాదుతున్నాడు.

ఈ లోపున దొరసాని లేచింది. పిల్లలు పనివాళ్ళు లేచేరు. అన్ని గదుల్లోనూ లైట్లు వెలిగేయి. గడీల జనమంతా మేడదిగి దక్షిణపు గదికి వచ్చేరు.

''కొట్టకు దొరా! నే జెప్పే దినుకో దొరా' లోకియా గోల పెట్టేడు.

''ఏందిరా నువ్ చెప్పేదీ...'' దొర హంటర్ విలయతాండవం చేస్తోంది.

లోకియాకి మళ్ళీ తళుక్కున ఆలోచన మెరిసింది. ''దొరా'' అని పులిలా గర్జించి సింహం ఏనుగు మీదికి దూకినట్లు దూకేడు దొరమీదికి. ఒడుపుగా దొర జబ్బలు పట్టుకుని హంటరు వూడలాక్కున్నాడు!

''నీకు మంచి చేస్తానైతె నన్నే బాదుతవుకదూ?'



ఫోటో - వారిస్

దొర వీపు మీద లోకియా చేతి హంటరు బలంగా పడింది.

వూహించని ఈ విపరీత పరిణామానికి నివ్వెర పోయి నిలబడ్డా రంతా!

''నీ యిసప్పెట్టె గదికి కన్నంబెట్టి దొంగం లచ్చిందొరసాని నగంన్నీ లూటీ చేస్తాన్నని నీకు జెప్పను లేపితే...''

''ఏందిరా — దొంగలా...'' కొమురిగాని నోరు పెగిలింది.

''ఆఁ. మరే. అటు చూడు...'' లోకియా చెయ్యి చాపిన వైపుకి అందరూ చూసేటంతలోనే ''అయ్యోవ్! ఫాటకు దూకుతాన్ను—జల్దీ ర్రావీ... హంటరు ఝళిపిస్తూ చీకట్లో చివ్వున పరుగు పెట్టేడు లోకియా!

లోకియా చేతి హంటరు రెండో దెబ్బ మరో దోపిడిదారు గోడ దూకబోతున్న ముచ్చు వీరన్న కాళ్ళ మీద తగిలింది. దభీల్న ఫాటక్ లోపల పడ్డాడు వాడు.

ఈ లోపున...మరిన్ని లైట్లు ... పనివాళ్ళు... పరుగులు ... పట్టుకోండి ... పట్టుకోండని కేకలు... బజార్లో అంతా లేవడం...

గేటు లోపల పడ్డ ముచ్చు వీరన్నలో లోకియా కలియబడి, వాడి కాళ్ళు, చేతులు పట్టుకొని గట్టిగా ఆగబట్టాలని చూసేడు. కాని వీరన్న శరీరమంతా ఆముదం పులుముకున్నాడు. జారిపోతున్న వీరన్న చడ్డీమాత్రం దొరికింది లోకియా చేతికి. లాఘవంగా చడ్డీ బొందు, వీరన్న మొలత్రాడు కలిపి పట్టుకున్నాడు. వీరన్న గింజుకున్నాడు. లోకియా పట్టు విడవలేదు. ''జల్దీరా, దొరా! ఇటు దిక్కు—ఫాటక కెల్లి...'' అరుస్తూనే ఉన్నాడు.

వీరన్న చేతిలో ఉన్న బాకులో లోకియా వీపు మీద గాట్లు పెడుతున్నాడు. గింజుకుంటున్నాడు.

ఆ యింతలో జనం గుమిగూడేరు. గత లంబాదా లేళ్ళుగా ప్రాంత మంతటినీ కలవరపెడుతున్న దోపిడీ ముఠా నాయకుడు 'ముచ్చు వీరన్న'ని క్షణంలో పగ్గాలతో వరండా స్తంభానికి కట్టేసేరు. వూరిలో కుర్రకారు లాంతర్లు, కర్రలతో బయల్దేరి వూరి శివార్లు కాసి తెల్లారేసరికి వీరన్న ముఠాలోని మిగిలిన మెంబర్స్‌ని కూడా పట్టేసేరు.

ధర్మారెడ్డి సొమ్ము ఆవగింజంత కూడా కద ల్లేదు. లచ్చిం దొరసాని జవాహరీ చెక్కు చెదరలేదు.

లోకియా ఒంట్లోనించి చాలా రక్తం పోయింది. ధర్మారెడ్డి డాక్టరు గారిని పిలిపించి దగ్గరుండి వాడికి కట్టు కట్టించేరు.

''జర మంచి తిండి పెట్టాలె వీనికి కొన్నాళ్ళు.'' లోకియాకి ఇంజక్షనిస్తూ డాక్టరుగారు ధర్మారెడ్డికి సలహా ఇచ్చేరు.

పెద్ద గ్లాసుడు పాలలో 'గుడ్డు' కొట్టి కలిపి లోకియాకి అందిస్తూ కన్నీళ్ళు పెట్టుకుంది దొరసాని!

''నువ్విగ ఈడనే ఉండురా, లోకియా—నా పిల్లలకు చిన్నాన్న లేడు! నాకు మర్ది లేదు. నువ్వు గడీల్నే ఉండురా!'' లోకియా వీపు మీది పుండు పరిశీలిస్తూ రెండు వెచ్చటి కన్నీటి బిందువులు రాల్చింది దొరసాని. ✱